# విరుగుడు మందు

అప్పుడే ఆఫీసు నించి వచ్చి, టీ తాగి బద్ధకంగా పడక కుర్చీలో జేర్లగిలపడ్డాను. "సాయంత్రము ఎల్లా గడుస్తుంది?" అన్న బెంగ నన్ను అమాంతంగా పట్టి పీడించటం మొదలెట్టింది.

ఎందుకో సాయంత్రాలు గడవటం దుర్ఘటమై పోయింది.

"సాయంత్రాలు గడవటం అంటే?"

ఆలోచించాను.

సంతోషంగా, ఉత్సాహంగా, ఉద్రేకంగా గడవడమని తోచింది.

సంతోషం వుంటే, ఉత్సాహోద్రేకాలు వాటంతటవే పుట్టుకొస్తాయి.

"అయితే సంతోషం ఎల్లా లభిస్తుంది?"

తిరిగి ఆలోచించాను.

సంతోష సాధనకి కావలసినంత డబ్బు అవసరం—

డబ్బు! డబ్బు! డబ్బు!

కాని నెల జీతాలతో గడిపే జీవితాలకి కావలసినంత డబ్బు ఎక్కడి నుంచి వస్తుంది? ఆలోచనలతో క్షణ క్షణానికీ బుర్ర వేడెక్కి పోతున్నది.

డబ్బుతో తీరైన వస్తువు దొరుకుతుంది — కాని అనువైన మనస్సు లభిస్తుందా? లభించక పోవచ్చు.

కాని లభించే అవకాశం లేకపోలేదు.

అప్పుడు ఏమీ తోచకుండా వుండడం తగ్గిపోతుందా?

జీవితంలోని "మొనాటనీ" హరించుకుపోతుందా?

ఏమో?

ఆ చాలినంత డబ్బే కొంతకాలం తరువాత మనకి ఏమీ తోచకుండా చేస్తే? పోనీ ఆ డబ్బు ద్వారా అనువైన మనస్సు లభించి, ఆ అనుకూలమైన మనస్సే, కొంత కాలానికి, మన జీవితాన్ని ఏమీ తోచకుండా మార్చివేస్తే? అంతకంటే దారుణం, మరి ఒకటి ఉండదు.

అయినా, చాలినంత డబ్బు సంపాదించడం ఈ జన్మలో దుర్భరం. సంతోష సాధనకి, ఇది మార్గం కాదు. మార్గాంతరం ఏమైనా ఉందా?

ఆ క్షణాన్నే ఆలోచనగా మార్చాను. మార్గాంతరం ఏమీ కనపడలేదు. నిస్పృహ జెంది, పగటికలల్లోకి దిగజారాను. ఏ తరతరాలనిధో, భూగర్భంలోంచి, పైకి ఉబికివస్తే! ఆ క్షణంలో ఇంటికప్పు చీల్చుకొని ఏ అప్సరసో దేవలోకం లోంచి, మెరుపుతీగల మీదుగా నా గదిలోకి దిగివస్తే? అంతకంటే జీవితంలో కోరుకోదగ్గదేముంటుంది? అటువంటి అపురూప సంఘటనకోసం ఉవ్విళ్ళూరాను.

నిజంగా జరుగుతుందేమోనని ఆశించి, నేలా, కప్పూ, నా పంచ ప్రాణాలనే కళ్ళల్లో నింపుకొని, కలియజూచాను. కాని నేను ఆశించిన సంఘటన జరగలేదు. నిజంగానే జరిగి వుంటే? జీవితంలో ఇది ఒక కొత్తసంఘటన. ఒక సరికొత్త అనుభూతి.

ఉత్తరక్షణంలో, ఒక సరికొత్తభావం, నా మెదడులో మెరుపుకుమల్లే తళుక్కున మెరిసింది.

అడుగడుగునా, జీవితంలో, ఒక నూతనోత్సాహాన్ని నింపుకుంటే? ఎప్పటికప్పుడు, జీవితంలో, వినూత్న సంఘట నల్ని సంఘటింప జేసుకుంటే జీవితంపట్ల ఒక కొత్త ఆసక్తి కలుగుతుంది. బ్రతుకుపట్ల ఒక సరికొత్త అభిరుచి కనిపిస్తుంది. జీవితంలో క్రమంగా ఒక కొత్తమార్పు వస్తుంది. కొత్త సంఘ టనలు సంఘటిల్లాలంటే, కొత్త మొహాలు చూడాలి. సరికొత్త పరిచయాలు చేసుకోవాలి. కొత్త అనుభవాన్ని గడించాలి. సరికొత్త అనుభూతుల్ని అన్వేషించాలి. అప్పుడు — బ్రతుకు భయం తగ్గుతుంది. మొనాటనీ మటుమాయమవుతుంది. ఒక కొత్త ఆనందం, ఒక కొత్త ఉత్సాహం వెల్లివిరుస్తుంది. కొత్త మొహాలు—సరికొత్త పరిచయాలు. మార్గాంతరం కనపడ డంతో నా హృదయం ఎగిరి గంతు వేసింది. వినూత్నోత్సా హంతో నా మెదడు పరవశమై, పరవళ్ళుతొక్కింది. కలకాలం నించీ కవులు, జీవితాన్ని సుఖమయంగా ఆనందప్రదంగా చిత్రిస్తూ వచ్చారు; ఇది శుద్ధ అబద్ధం.

నిజం విచారిస్తే, జీవితం "మొనాటనీ"మయం—ఏమిాలోచని నిబిడాంధకారం. "మొనాటనీ"ని పోగొట్టుకోవడానికి సంబం ధించిన ఈ ఆలోచనలతో నేను ఉక్కిరిబిక్కిరి అవుతుండగా శర్మ వచ్చాడు.

వచ్చీరావడంతోనే "బయల్దేరుదామా?" అని అడిగాడు.

"ఎక్కడికీ?" అని ప్రశ్నించాను.

శర్మకూడా నాకుమల్లేనే, "మొనాటనీ"తో ప్రతి సాయంత్రం బాధపడుతున్నాడు. కాలేజీలో నాలుగు అక్షరాలు విద్యార్థులకి చెప్పి, ఇంటికి రావడంతో అతనికీ ఏమీతోచదు.

మా యిద్దరికీ, ప్రతిసాయంత్రం, ఏమీ తోచకపోవడం మూలాన ఇరువురమూ స్నేహితులమైనాం.

కొన్నాళ్ళు తప్పతాగి, వీథులవెంబడి తప్పటడుగులు వేశాం. కొన్నాళ్ళు వచ్చిన కొత్తపిక్చర్ కల్లా వెళ్ళి, కళ్లూ, కాళ్లూ గుల్లచేసుకున్నాం. కొన్నాళ్ళు ఎక్కినబస్సు ఎక్కకుండా, హైద్రాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల్లో, జీవితమే అనంత ప్రయాణంగా, తిరిగీ తిరిగీ అలసిపోయాం.

ఇప్పటికీ డబ్బున్నప్పుడల్లా, ఈ పనులన్నీ చేస్తూనే ఉన్నాం.

డబ్బు లేనప్పుడు, నారాయణగూడెం క్రాసింగ్ దగ్గర వున్న ఇరానీహోటల్ లో టీలు చప్పరిస్తూ, ఏమీ తోచక, క్షణం ఒక యుగంగా కాలం వెళ్ళదీస్తున్నాం.

అయినా మొనాటనీ తగ్గలేదు.

కాగా జీవితమే, ఒక మొనాటనీగా మారింది.

"నీ దగ్గర డబ్బేమైనా వుంటే, ఏ పిక్చర్ కైనా వెడదా" మన్నాడు శర్మ.

నా దగ్గర ఎక్కువ డబ్బు లేదని ముందుగానే తెలుసు శర్మకి. అందువల్ల అతను బార్ సంగతి ఎత్తలేదు – లేకపోతే బార్ కి వెడదామనేవాడే.

"రెండు రూపాయలు ఉన్నాయి – పిక్చర్ కి సరిపో వచ్చు" – కాని ఈ రోజు మనం పిక్చర్ కి వెళ్ళకూడదు." అని నేను శర్మకి నిక్కచ్చిగా చెప్పాను.

"ఎందువల్ల?" అని వెంటనే అడిగాడు శర్మ నా వాక్యం పూర్తి గాకముందే.

"ఈ రోజున మనం రొటీన్ తప్పించుకుందాం" అన్నాను నేను దృఢసంకల్పంతో.

"అయితే సాయంత్రం గడపడం ఎల్లా?" అన్నాడు శర్మ దిగాలుగా.

ఒక రొటీన్‌కి అలవాటు పడ్డ మనుషులకి మార్పు అంటే ఎంతో భయం. తమంతట తాము మార్పు కోసం ప్రయత్నించరు. దానంతటదే మార్పుసంభవిస్తే, నిలవద్రొక్కుకొని దాన్ని ఎదుర్కోడానికి భయపడుతారు. శర్మ మన స్తత్వం కూడా సరిగ్గా ఇదే.

"రొటీన్ మారుస్తే సాయంత్రాలు గడువవా?" అని ఎదురు ప్రశ్న వేశాను శర్మని.

శర్మ, ఏమీ తోచక, బిత్తర చూపులు చూడడం మొదలు పెట్టాడు.

"ఇవాళ మనం ఇరానీ హోటల్‌కి వెళ్ళడం మానేసి, కాలినడకని సుల్తాన్‌బజార్‌కి వెడుదాం" అన్నాను నేను, నా కృతనిశ్చయాన్ని సూచించే కంఠంతో.

శర్మ కళ్ళల్లో బిత్తర చూపులు మరీ ఎక్కువైనాయి.

"వీథు లెంబడి పడితే, కొత్త మొహాలు కనపడుతాయి – మనకు నచ్చితే, వాటిని అన్వేషించ వచ్చు. కొత్త పరిచయాలు చేసుకోవచ్చు. సరికొత్త అనుభవాలు గడించ వచ్చు" అని నా ఉద్దేశాన్ని వివరించాను శర్మకి.

నా వివరణలోని అంతరార్థాన్ని గ్రహించి నట్టున్నాడు శర్మ.

సంతృప్తితో అతని కళ్ళు విప్పారినాయి.

ఇంటి నుంచి బయల్దేరాం. వీధుల వెంబడి పడ్డాం. హీరోలకి మల్లే హిమాయత్ నగర్ నించి, నారాయణగూడెం క్రాసింగ్ వరకు నడిచాం. అనుకోకుండా — వీధిని రెండుగా చీల్చాం — ఎడమ వేపు సగం రోడ్ నాది — కుడివేపు సగం వీధి శర్మది. ఎడమవేపు పేవ్ మెంటుమీద నేను నడుస్తున్నాను. కుడి పేవ్ మెంటు పైన శర్మ నడుస్తున్నాడు. కన పడిన స్త్రీనల్లా, రిక్షాల్లో వెళ్ళే స్త్రీలతోసహా, పరీక్షగా చూస్తున్నాం. ఏ స్త్రీ నచ్చలేదు. నారాయణ గూడెం క్రాసింగ్ వరకూ ఏ సంఘటనా జరగలేదు. నారాయణగూడెం మలుపుమళ్ళాం; సుల్తాన్ బజార్ దారి పట్టాం.

నాలుగు కాళ్లూ నడుస్తూనే ఉన్నాయి.

రెండేసి కళ్ళు, కొత్త మొహాల్ని పిలిచి స్నేహం చేసుకోవడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాయి.

నారాయణగూడెం మూలమలుపునించి వంద గజాలు ముందుకు నడిచామో లేదో, నాకు ఒక అమ్మాయి తారసిల్లింది.

ఆ అమ్మాయి ముందు నడుస్తున్నది.

నేను వెనకాల నడుస్తున్నాను.

తెల్లచీర, పట్టంచు తెల్లటి జాకెటు. మనిషి దాదాపు ఇరవై సంవత్సరాలు ఉంటుంది. తెల్లటి చీరంటే, నాకు ఎంతో ఇష్టం. ఒక విధమైన వీక్ నెస్ కూడా. తొలిచూపులో ఇష్టపడ్డాను. ఇంకా మొహం చూడలేదు. అందువల్ల అది తొలిచూపు అవుతుందో, కాదో? ఒకమాటు ఆ అమ్మాయి వెనక్కి-మళ్ళితే బాగుండుననిపించింది. ఏ దేవతని

ప్రార్థించను, ఒకసారి ఆ అమ్మాయిని నా వేపుకు తిప్పమని! ప్రత్యేకంగా ఏ ఒక్క దేవతా కనపడక, 33 కోట్ల దేవతల్ని ప్రార్థించాను. కాని ఏ దేవతకీ నాపైన జాలి కలగ లేదు. ముందుకు నడిచి వెళ్ళి, ఒక మాటు వెను దిరిగి చూస్తే! కాని, అది సరి అయిన పద్ధతి కాదని ఎప్పుడో శర్మ అన్నట్టు జ్ఞాపకం. అందువల్ల నేను ముందుకు వెళ్ళ డానికి సాహసించ లేదు.

ముందు ఆ అమ్మాయి, వెనకాల నేను. నడకే ఒక సంసార యాత్రగా సాగింది. ఇంతలోకే వై. యం. సి. ఏ. బస్సుస్టాండ్ కి చేరుకున్నాం. అక్కడ ఒక పెద్ద గుంపు, ఒక గొప్ప గలాటా. నా ఏకాగ్రతికి భంగం కలిగింది. ఆ అమ్మాయి గుంపులో ఎక్కడో మటుమాయమైంది. ఎంతో వెతికాను. ఏమీ లాభం లేక పోయింది.

భ్రష్టయోగికి, నారీ వియోగం సంభవించింది. గుంపులో ఒకడుగా శర్మ కనపడ్డాడు, కుడివేపునుంచి ఎడమవేపుకి ఎప్పుడు వచ్చాడో, ఎప్పుడు ఆ గుంపులో కలిసాడో నాకు తెలియదు. అక్కడ జరిగిన సంఘటనని గూర్చి వివరాలు తెలుసుకుంటున్నాడు. అతను ఆ సంఘటనపట్ల అంత అభి రుచిని కనపర్చడం, మొదట నాకు కొంత సంతృప్తిని కలుగ జేసింది. గుంపులో ప్రజలు, మాట్లాడుకుంటున్న విషయాలు నూతిలోని గొంతుకలుగా నాకు వినపడుతున్నాయి. ఎవరో కుర్రవాడు, జేబు కత్తిరించాడని మాత్రం తెలుసుకోగలిగాను. శర్మ, ఆ కుర్రవాడినీ గూర్చి, తన పక్కనవున్న మనిషిని ఏవో ప్రశ్నలు అడుగుతున్నాడు. నాకు విసుగువేసింది. శర్మ బుజం పట్టుకొని, గుంపులోంచి అతన్ని వెలుపలికి లాగాను.

"ఉండు ఎందుకలా లాగుతావు?" అంటున్నాడు శర్మ. "గాలికి వెళ్ళే కంపని మన నెత్తిమీద వేసుకోవడం ఎందుక"న్నాను నేను. "ప్రతి విషయంపట్ల ఆసక్తి కలుగ చేసుకోవడం ఇదేనా?" అని అడిగాడు శర్మ. నేను ఏమీ మాట్లాడలేదు.

నా వాలకం చూసి, "ఏమిటి అల్లా ఉన్నావు?" అని అడిగాడు శర్మ.

శర్మకి ఏమని చెప్పను, చేతులారా ఆ అమ్మాయిని పోగొట్టుకున్నానని? కాగా ప్రథమ ప్రయత్నమే విఫల మైందని? ఎక్కడైనా 'టీ' తాగుదామన్నాను, శర్మ ప్రశ్నని తప్పించుకునే ధోరణిలో – పాదయాత్ర చాలించి వెనక్కి మళ్ళాను.

"ఏం, ఆ అమ్మాయి తిరిగి కనపడలేదా?" అని అడిగాడు శర్మ విధిలేక నన్ను వెంబడిస్తూ – నేను సమాధానం చెప్పలేదు.

ఆ రోజు ఇరానీ హోటల్‌కి వెళ్ళలేదు. పక్కనే ఉన్న 'ఇంద్ర భవనం'లోకి వెళ్ళాం. ఇంద్రభవనంలో అభినవ ఇంద్రాది దేవతలు ఎవ్వరూ కనపడలేదు. ఒక టేబుల్ తప్ప మిగిలినవన్నీ ఖాళీగా, బోసిగా ఉన్నాయి. ఆ ఒక్క టేబుల్ దగ్గర, పెద్ద తెల్లటి గడ్డంతో, ధోతీ లాల్చీలతో ఉప్మా దేవతకోసం ఒక అభినవ ఋషి పుంగవుడు తపస్సు చేస్తున్నాడు. శర్మ చకచకా ఆ ఋషి పుంగవుడి దగ్గరికి వెళ్ళి, 'మిమ్మల్ని ఎక్కడో చూసినట్లు జ్ఞాపకం' అన్నాడు ఆలోచనని నటిస్తూ.

ఋషి పుంగవులకి కోపం ఎక్కువ. అందులో ఛాందస ఋషి పుంగవుల సంగతి చెప్పనే అక్కరలేదు.

"ఎక్కడో కాదు, ఇక్కడే చూచావు" అన్నాడు ఋషి ఏకవచనాన్ని ప్రయోగిస్తూ. అయినా చలించక అదే టేబుల్ దగ్గర ఇద్దరమూ రెండు కుర్చీల్లో చతికిల బడ్డాం. "ఎప్పుడో కాదు, ఇప్పుడే చూచావు" అని అంటాడేమో నని కూడా అనుమానం వేసింది. కాని అతని పుణ్యమా అని ఆ వాక్యం అనలేదు. "మనది గుంటూరా?" అని నెమ్మదిగా అడిగాడు శర్మ. అతని ఏకవచన ప్రయోగాన్ని కూడా లక్ష్యం చేయకుండా.

"కాదు హైద్రాబాదు" అని అతను ఫెళ్ళున సమాధానం చెప్పాడు. "మనిషి ఆంధ్ర ప్రాంతము వాడుగా కనుపడుతున్నాడు. ఇల్లా ఎందుకు కటువుగా జవాబు చెబుతున్నాడా?" అని నేను ఆలోచించడం మొదలు పెట్టాను... ఒకరి ఉద్దేశాన్ని ఇంకొకరు తప్పుగా అర్థం చేసుకోలేదు కదా? అంతే అయి ఉంటుంది. కొత్త పరిచయం చేసుకుందామన్న ఉత్సాహం కొద్దీ శర్మ, అతను కూర్చున్న టేబుల్ దగ్గరకి గబగబా వెళ్ళాడు. శర్మ ఏదో అల్లరి చేయడానికి వస్తున్నాడని అతను ఊహించాడు. దానితో అతను విరసంగా మాట్లాడడం ఆరంభించాడు. అమాయకుడు శర్మ, అతని ధోరణి గ్రహించ లేదు.

"మీ రేమి చేస్తుంటారు?" అని శర్మ తిరిగి అమాయకంగా ప్రశ్నించాడు. ఏ విధంగానైనా అతని పరిచయం కలుగ జేసుకుందామనే ఆతురతకొద్దీ. "గాడిదలు కాస్తాను,

సరేనా ?'' అన్నాడు ఆ పెద్దమనిషి, తన కోపాన్ని అణచు కోలేక. దానితో శర్మ అల్లరి ధోరణిలో పడ్డాడు.

"అబ్బబ్బ! ఎంత చక్కటి పని చేస్తారండీ'' అని అందుకున్నాడు శర్మ,

వ్యవహారం శ్రుతిమించి రాగాన పడుతున్నది. నేను కల్పించుకుంటే, నాలుగు అక్షింతలు నా పైన కూడా పడ వచ్చుననే భయంకొద్దీ, నేను మౌనం వహించాను.

"ఎంత వెతికినా, నాణెమైన గాడిదలు కనపడలేదు. ఇప్పుడే రెండు కనపడ్డాయి'' అని అతను ఉక్రోషం కొద్దీ విసరి కొట్టాడు.

"మీరు కాదన్నారు కాని మీది తప్పక గుంటూరే అయివుంటుందండీ'' అని అన్నాడు శర్మ పెంకెగా నవ్వుతూ.

"కాదన్నానా ? పొరపాటు. మాది ముమ్మాటికీ గుంటూరే'' నని అతను బలంకొద్దీ శర్మ చంపమీద ఈడ్చి కొట్టాడు. సర్వర్ తెచ్చిన ఉప్మావేపు ఒకమాటు అయినా చూడకండా, హోటల్ లోంచి అతను చరచరా వెళ్ళి పోయినాడు.

శర్మ చంపకు అయిదు వేళ్లు అంటుకు పోయినాయి.

ఆ పెద్దమనిషి గుంటూరు వాడు అవునో కాదో చెప్ప లేను కాని, ఆంధ్రప్రదేశ్ మనిషికి ఉండవలసినంత కోపం అతనికి వుందని నేను నిస్సందేహంగా చెప్పగలను.

శర్మ చెంప బురబుర పొంగింది. మంటకి తట్టుకోలేక, అతను, తన కుడి చేతితో కుడి చెంపని రాచుకుంటున్నాడు. "కొత్త పరిచయం కలగక పోయినా మొనాటనీ తగ్గింది. కలకాలం మరపునకురాని అనుభవం కలిగింది" అని అన్నాను నేను చిరునవ్వుతో, శర్మ కళ్ళల్లోకి చూస్తూ. శర్మ వెంటనే నన్ను కొట్టడానికి చెయ్యి ఎత్తాడు. నేను చప్పున గంతు వేసి, పక్క-సీటుమీద నవ్వుతో కూర్చున్నాను.

గడ్డం పెద్దమనిషి తప్పించుకున్నా ఉప్మా నా పాల బడ్డది.

★